www.aksharavelugu.com

# అక్షర వెలుగు

జనం కోసం - మన అక్షరం

తెలుగు దిన పత్రిక

ఆది వారం
05. 06. 2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
సంపుటి - 01, సంచిక-95
పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :
గోసుకొండ పృథ్విరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## తెలంగాణపై కొనసాగుతున్న కేంద్రం వివక్ష



■నిధుల విడుదలలో తీవ్రనిర్లక్ష్యం

■పాలమూరులో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కెటిఆర్

**హైదరాబాద్, జూన్ 4 (అక్షర వెలుగు):** కేంద్రం తీరుపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు మరోమారు తీవ్రంగా ధ్వజమెత్తారు. నిధులు ఇవ్వడంలో విక్ష చూపుతోందన్నారు. తెలంగాణకు కేంద్రం నిధులు ఇవ్వకుండా వివక్ష చూపుతోందని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించిన మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దేవరకద్ర మండలం వెంకపల్లి లో రూ.55 కోట్లతో పేరూరు ఎత్తిపోతల పథకానికి మంత్రి శంకుస్థాపన చేశారు. వర్నె వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై రూ.18 కోట్లతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భూత్పూర్ మున్సిపాలిటీలో క్రీడా ప్రాంగణ నిర్మాణానికి మంత్రులు శ్రీనివాస్ గౌడ్, ప్రశాంత్ రెడ్డితో కలిసి శ్రీకారం చుట్టారు. అమిస్తాపూర్‌లో బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రానికి తెలంగాణ రూ.3.65లక్షల కోట్లు ఇస్తే.. రూ.1.68లక్షల కోట్లు మాత్రమే ఇచ్చిందని, తాను చెప్పింది నిరూపి స్తే రాజీనామాకు సిద్ధమన్న కేటీఆర్.. బీజేపీ చెప్పింది తప్పయితే అమిత్ షా

## సిఎస్ సోమేశ్ కుమార్‌తో యూపి అధికారుల భేటీ

వాణిజ్య పన్నుల వసూళ్లు, ఆదాయాలపై ఆరా

**హైదరాబాద్, జూన్ 4 (అక్షర వెలుగు):** ఉత్తరప్రదేశ్ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సీనియర్ అధికారులు శనివారం బి.ఆర్.కె.ఆర్ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, ఇతర వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆదాయాన్నిపెంచేందుకు కమర్షియల్ టాక్స్ శాఖ అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఈ సందర్భంగా ఉత్తర ప్రదేశ్ బృందానికి ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ వివరించారు. వాణిజ్య పన్నుల శాఖ మంత్రిత్వ శాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు మార్గదర్శకత్వంలో వాణిజ్యపన్నుల శాఖ ద్వారా రాష్ట్ర ఆదాయం 2014లో సుమారు రూ. 23 వేల కోట్లు ఉండగా, గత సంవత్సరం ఇది దాదాపు మూడు రేట్లకు పెరిగి రూ. 65 వేల కోట్లకు చేరుకొందని ఆయన వివరించారు. రాష్ట్రంలో పన్ను చెల్లింపుదారుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని తెలిపారు. వ్యవస్తీకృత మార్పుల ద్వారా శాఖ పనితీరులో కూడా గణనీయమైన మార్పు వచ్చిందని తెలియజేశారు. మాన్యువల్ ఆధారిత నోటీసులు, ప్రొసీడింగ్‌ల జారీలను పూర్తిగా తొలగించామని చెప్పారు. ప్రతీ స్థాయిలో భౌతిక లక్ష్యాల స్థానంలో నిర్ధారిత ఆధారిత లక్ష్యాలను ఏర్పాటుచేశామని తెలిపారు. కొత్తగా అనేక సర్కిళ్లను ఏర్పాటు తదితర చర్యల ద్వారా వాణిజ్య పన్నుల శాఖను పూర్తిగా పునర్ వ్యవస్థీకరించామని, కొత్తగా శాఖ పరంగా పరిశోధన, విశ్లేషణల కోసం ఎకనామిక్ ఇంటెలిజెన్స్ యూనిట్లు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. కాగా, తెలంగాణా రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ద్వారా అమలవుతున్న ఉత్తమ విధానాలను తెలుసుకోవడం తమకు అవకాశం



## బండికి దమ్ముంటే కేంద్రం నుంచి నిధులు తేవాలి



ప్రజల సంక్షేమానికి పాటుపడింది ఎన్టీఆర్, కెసిఆర్‌లే

మీడియాతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**కరీంనగగర్, జూన్ 4 (అక్షర వెలుగు):** బండి సంజయ్‌కు దమ్ముంటే కేంద్రంతో కొట్లాడి నిధులు తేవాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు తెలంగాణ గురించి ఏమీ తెలియదని మంత్రి ఎర్రబెల్లి పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజుకు.. తెలంగాణకు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఇక్కడి పథకాలు తెలంగాణలో ఎక్కడైనా ఉన్నాయా? అని ప్రశ్నించారు. సర్పంచ్‌లకు రాష్ట్రం ఇవ్వాల్సిన నిధులు అన్నీ ఇచ్చేశామన్నారు. కేంద్రమే తన వాటా ఇవ్వడం లేదని ఎర్రబెల్లి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం మల్కాపూర్ లో ఏర్పాటుచేసిన గ్రామీణ క్రీడా మైదానాన్ని మంత్రి గంగుల కమలాకర్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడుతూ కేంద్రం తెలంగాణ పట్ల వివక్షను మానుకోవాలన్నారు. సీఎం రైతులను ఆదుకోవాలని ఆలోచిస్తున్నప్పుడు పట్టుబట్టి ధాన్యం కొనేలా గంగుల ఒప్పించాడని తెలిపారు. తనకు నచ్చిన సీఎంలు ఎన్టీఆర్, కేసీఆర్ అని..ఎన్టీఆర్ పట్వారీ వ్యవస్థ రద్దు చేసి..పేదలకు 2 రూపాయలకు కిలో బియ్యం ఇస్తే..రైతులకు ఎకరాకు 10 వేలు పెట్టుబడిని కేసీఆర్ ఇస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారంలో ఉన్న చోట ప్రజలకు చేసిందేమి లేదని విమర్శించారు. తెలంగాణ పోరాటంలో అల్లూరి సీతారామరాజు పాల్గొన్నాడంటూ అమిత్ షా చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఈజేఎస్ కు సంబంధించి కేంద్రం నుండి 800 కోట్ల నిధుల రావాలని మంత్రి చెప్పారు. కరోనా వల్ల

## భవిష్యనిధి రేటు తగ్గింపుపై రాహుల్ విమర్శలు

చిరునామాలో లోక్ కళ్యాణ్ ఉంటే సరిపోదంటూ ట్వీట్

**న్యూఢిల్లీ, జూన్ 4 (అక్షర వెలుగు):** చిరునామాలో ప్రజా సంక్షేమాన్ని పెట్టుకున్నంత మాత్రానికి సరిపోదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఉద్యోగుల భవిష్య నిధి వడ్డీ రేటును తగ్గించిన నేపథ్యంలో శనివారం గాంధీ ఓ ట్వీట్ చేశారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో భవిష్య నిధి డిపాజిట్లపై వడ్డీ రేటును 8.1 శాతంగా నిర్ణయించిన సంగతి తెలిసిందే. నివసించే ఇంటి చిరునామాలో 'లోక్ కల్యాణ్ మార్గ్' అని పెట్టుకున్నంత మాత్రానికి ప్రజలకు సంక్షేమం జరగదని హితవు పలికారు. 'ఇంటి చిరునామాను 'లోక్ కల్యాణ్ మార్గ్' అని పెట్టుకోవడం ప్రజలకు సంక్షేమాన్ని తీసుకురాదు. 6.5 కోట్ల మంది ఉద్యోగుల వర్తమానం, భవిష్యత్తును నాశనం చేయడానికి 'ద్రవ్యోల్బణం పెంపు, ఆదాయం తగ్గింపు'

## వీడియోలు, ఫోటోలు బయటపెట్టిన బిజెపి

మైనర్ బాలిక గ్యాంగ్ రేప్ కేసు

పోలీసుల్లో కలవరం.. అత్యవసరంగా భేటీ అయిన ఇంటిలిజెన్స్

సిబిఐ విచారణ కోరుతూ సిఎంకు బండి సంజయ్ లేఖ

**హైదరాబాద్, జూన్ 4 (అక్షర వెలుగు):** తెలంగాణ రాజధాని నడిరోడ్డుపై మైనర్ బాలికపై జరిగిన గ్యాంగ్ రేప్ ఘటన ఒక్కసారిగా తెలంగాణ వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఘటనకు సంబంధించి పలు సంచలన విషయాలు వెలుగులోకి రాగా.. తాజాగా ఈ ఘటనకు సంబంధించి ఫొటోలు, వీడియోలను బీజేపీ రిలీజ్ చేసింది. శనివారం నాడు హైదరాబాద్‌లో మీడియా మీట్ నిర్వహించిన బీజేపీ ఎమ్మెల్యే రఘునందనరావు ఈ ఫొటోలను రిలీజ్ చేశారు. దీంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఉన్నతాధికారులు హుటాహుటిన సమావేశమయ్యారు. బాలిక అత్యాచారం కేసుపై విచారణ నిర్వహిస్తు న్నారు. సమావేశానికి ఎస్పీ, లా అండ్ ఆర్డర్, ఇంటెలిజెన్స్, వెస్ట్ జోన్ పోలీసులు హాజరయ్యారు. అసలు నిందితుల వీడియోలు, ఫోటోలు ఎలా లీక్ అయ్యాయన్న దానిపై ముఖ్యంగా పోలీసులు ఆరా తీస్తున్నారు. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావుకి ఈ వీడియోలు ఎలా చేరాయనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. హైదరాబాద్ లో జరిగిన మైనర్ బాలిక అత్యాచారం కేసులో న్యాయం



## తెలంగాణలో కులవృత్తులకు పెరిగిన ప్రాధాన్యం



గొర్రెలు, చేపపిల్ల పంపిణీతో ఉపాధి: తలసాని

**కామారెడ్డి, జూన్ 4 (అక్షర వెలుగు):** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల సమగ్రాభివృద్ధి సాధ్యమైందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి జీవితాల్లో కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం వెలుగులు నింపిందన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు ప్రస్తుతం ఉన్న పరిస్థితులు అందరికీ తెలిసినవేనన్నారు. గొల్ల కురుమలు అడుగక ముందే గొర్రెల పంపిణీ, మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లల పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.కామారెడ్డి జిల్లా కేంద్రంలో గొర్రెలు, మేకలకు నట్టల మందు పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యే బాజుల సురేందర్, షీప్ ఫెడరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనలో దేశానికే రాష్ట్రం ఆదర్శంగా

## వరుస ఘటనలు జరుగుతున్నా చర్యలేవీ

గ్యాంగ్ రేప్‌పై సిబిఐ విచారణ చేయాలి: భట్టి

**హైదరాబాద్, జూన్ 4 (అక్షర వెలుగు):** హైదరాబాద్‌లో పబ్, డ్రగ్స్‌ను కంట్రోల్ చేయడం లేదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వరుస ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం రావడం లేదన్నారు. కంట్రోల్ లేకపోవడం వలన మైనర్ బాలికపై అఘాయిత్యం జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాధ్యత వహించాలన్నారు. బాధ్యుల మీద చర్యలు తీసుకోవాలన్నారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. మైనర్‌లను పబ్‌లకు ఎలా అనుమతి ఇస్తున్నారని అన్నారు. అలాగే ఎలా మద్యం



## తెలంగాణకు మోడీ చేసిందేమీ లేదు

కెసిఆర్‌తోనే తెలంగాణ పురోగతి

కేంద్రం మోకాలడ్డుతున్నా ముందుకు సాగుతున్న కెసిఆర్

పట్టణ ప్రగతిలో ఇంద్రకరణ్ రెడ్డి



**నిర్మల్, జూన్ 4 (అక్షర వెలుగు):** రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రూపురేఖలు మారిపోయాయని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ.. తెలంగాణకు చేసిందేమీలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అభివృద్ధితోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయని, వాటిని సకాలంలో అర్హులైన వారందరికీ అందేలా చూసే బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. పట్టణ ప్రగతిలో భాగంగా మంత్రి ఇంద్రకరణ్ మున్సిపాటిలోని రాంబాగ్, నాయుడివాడలో పర్యటించారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో చేపట్టాల్సిన పనులు, గత పట్టణ ప్రగతిలో చేపట్టిన పనుల పరిష్కారం, పురోగతిపై ఆరా తీశారు. అభివృద్ధి పనులతోపాటు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని

## కోటి ఆస్పత్రిలో మంత్రి హరీష్ ఆకస్మిక తనిఖీ



రోగులకు అందుతున్న సదుపయాలపై ఆరా

**హైదరాబాద్, జూన్ 4 (అక్షర వెలుగు):** నరగరంలోని కోఠి ప్రభుత్వ ప్రసూతి దవాఖానను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వార్డులను కలియదిరిగారు. రోగులకు అందిస్తున్న సేవలు, ఇతర సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. మందులు, ఆహారం అందుబాటులోనే ఉన్నాయా? అని ఆరా తీశారు. అన్నీ

## పట్టణాలను స్వచ్ఛంగా మార్చేందుకే పట్టణ ప్రగతి

విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**హైదరాబాద్, జూన్ 4 (అక్షర వెలుగు):** పట్టణాలను స్వచ్ఛంగా మార్చేందుకే పట్టణ ప్రగతి ముఖ్య ఉద్దేశమని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా జలపల్లి మున్సిపాలిటీలో పట్టణ పగ్రతి కార్యక్రమానికి మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో బీటీ, సీసీ రోడ్డు పనులు, వరద నీటి కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే శ్రీరామ్ కాలనీలో



## సంపాదకీయం

# అంతా బాగుందంటూ ఎన్నాళ్లీ వంచన ?

ప్రపంచమంతా భారత్‌వైపు చూస్తోందని ప్రధాని మోడీ సెలవిచ్చారు. మన శక్తి సామర్థ్యాలను కొనియా డుతోందని గుర్తుచేశారు. గ్లోబల్ రిటైల్ సూచికలో రెండో స్థానంలో నిలిచిందని, ప్రపంచంలో చమురు, విద్యుత్, గ్యాస్ శక్తిని ఉపయోగించుకొనే దేశాల్లో మూడో స్థానంలో ఉందని కూడా లక్నోలో పెట్టుబడి సమ్మిట్‌లో సెలవిచ్చారు. గతేడాది 100కు పైగా దేశాల నుంచి ఇండియాకు రికార్డు స్థాయిలో 84 బిలియన్ డాలర్ల ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. 417 బిలియన్ డాలర్లకు పైగా విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేశాం. ఇదొక సరికొత్త రికార్డుగా ప్రధాని మోడీ అభివర్ణించారు. ఇంత జరుగుతున్నా దేశం మాత్రం పురోగమిస్తున్న దాఖలాలు లేవు. ఆదానీ, అంబానీలు పోటీపడి బిలియనీర్లు అవుతున్నారు. మోడీ ప్రభుత్వం ఇటీవలే ఎనిమిదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకుంది. ఎనిమిదేళ్లుగా సంస్కరణ,పనితీరు,మార్పు అనే మంత్రంతో ముందుకు సాగుతున్నామన్నారు. విధాన నిర్ణయాల్లో స్థిరత్వం, పరస్పర సహకారం, సులభతర వాణిజ్యానికి పెద్దపీట వేస్తున్నామని కూడా సెలవిచ్చారు. అన్నీ బాగున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా మరి ప్రజల రాత బాగలేదా..లేక నేతల గీత సరిగా లేదా అన్నది అర్థం కావడం లేదు. ఒకే దేశంఒకే పన్ను గురించి పదేపదే పలు సందర్భాల్లో చెబుతున్న ప్రధాని మోడీ దాని దుష్ఫలితాలను చర్చించడం లేదు. నిజానికి పాలకులు తమ విధానాలపై చర్చించాలి. ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఎందుకు ప్రజల జీవితాలు బాగుపడడం లేదో గుర్తించాలి. ప్రజల కొనుగోలు శక్తి ఎందుకు పెరగడం లేదో చర్చించాలి. ప్రజలు ఏ విధాంగా బలవుతున్నారో గుర్తించడం లేదు. ఏయే రంగాలు కుదేలయ్యాయో చెప్పడం లేదు. ఆత్మనిర్భర్ అభియాన్‌లో భాగంగా 300 రక్షణ రంగ ఉత్పత్తులను ఇకపై దేశీయంగానే తయారు చేసుకో బోతున్నామని, రక్షణ తయారీ రంగంలోకి కొత్తగా అడుగుపెట్టబోతున్నవారికి మార్కెట్ సిద్ధంగా ఉందన్నారు. పెట్టబడి దారులకు భారత్ భూతల స్వర్గంగా మారుతోంది. దేశంలో సంస్కరణలు కొనసాగు తూనే ఉంటాయని భారత్ స్వయం సమృద్ధి సాధించడానికి అన్ని రంగాల్లో సంస్కరణలు చేపడతామని ప్రధాని అన్నారు. నిజానికి ఈ ఎనిమిదేళ్ల కాలంలో ఏయే రంగాలు ఎలా కుంచించుకు పోయాయో ఎలా దెబ్బతిన్నాయో గుర్తించి సమీక్షించుకుని ఉంటే బాగుండేది. సౌకర్యాలు పెరుగుతున్నా ప్రజల జీవనప్రమాణాలు, ఆదాయ వనరులు పెరగడం లేదు. బలమైన ప్రతిపక్షం ఉండాలని కోరుకుంటున్న మోడీ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకుండా చేసిన విషయాలన్ని గుర్తించాలి. పార్టీలో సీనియర్లు లేకుండా చేయడం వల్ల ఇవాళ ఏం జరిగినా చర్చించేందుకు ఎవరు కూడా లేకుండా పోయారు. అంతా ఫీల్‌గుడ్ వ్యవహారం... ఆర్థిక పరిస్థితి అమోఘం...దేశం ఆర్థికంగా దూసుకుని పోతోందని అంటున్నా మంచీ చెడులపై చర్చించడానికి ఎవరు కూడా సామసించే వారు కానరావడం లేదు. మోడీ, అమిత్ షాలు తప్ప పార్టీలో మరొకరు నోరు మెదిపే పరిస్థితి లేదు. దేశంలో ఆర్థికంగా బలంగా ఉందంటే ధరలు ఎందుకు పెరిగాయి. ద్రవ్యోల్బణం ఎందుకు కలవరపెడుతోంది. నిరుద్యోగం ఎందుకు తాండవిస్తోంది. రైతులకు ఎందుకు గిట్టుబాటు ధరలు దక్కడంలేదు. దేశంలో రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎందుకు ప్రజలకు కనీస వైద్య సేవలు అందడం లేదు. ఎందుకు ఇంకా సమస్యలు వెన్నాడుతున్నాయి. అన్న దానికి సమాధానం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి ఫీట్లు చేస్తే నిజంగానే పట్టించుకోవాల్సిన అవసరం లేదు. కానీ ప్రజల్లో ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన బిజెపి చేస్తున్న ఫీట్లు చూస్తుంటే ఏవగింపు కలగక మానదు. ప్రజలను వంచించడం తప్ప మరోటి కాదు. కాంగ్రెస్ పార్టీ కోవలోనే బిజెపి ప్రయాణించడం దారుణమైన విషయంగా పరిగణించాలి. ప్రపంచంలోనే శరవేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ మరోసారి మెరుపులు మెరిపించనుందని, చెప్పడం ద్వారా ఎవరిని మోసం చేయబోతున్నారో బిజెపి పాలకులు చెప్పాలి. ఒక్క నిత్యావసరాల ధరలను తీసుకుంటే చాలు...వీరి పాలన ఎంత దారుణంగా ఉందో చెప్పవచ్చు. బిజెపి పాలకులు సరే..పార్టీలోలని నేతలయినా ఈ పరిస్థితులపై స్పందించడం లేదు. అద్వానీ, మురళీ మనోహర్ జోషి లాంటి సీనియర్లను పక్కనపెట్టడంతో మాట్లాడే పెద్దలు లేకుండా పోయారు. ఆశాజనకమైన అంచనాలు అత్యంత బలహీనమైన ప్రాతిపదికలుగా ఆర్థిక వ్యవస్థలను చూపడం ఎంతవరకు సమంజసమో చెప్పాలి. ఆర్థిక రంగంలో పొంచి ఉన్న సవాళ్లపై సర్వే చేసిన హెచ్చరికలే ఇందుకు ఉదాహరణ. ఈ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకుంటే ఆర్థిక రంగంపై ఆశలు కల్పించడానికి సర్వే చేసిన ప్రయత్నాలు వీగిపోతాయి. యావత్తూ ప్రైవేటు పెట్టుబడులు, ప్రజా వ్యతిరేక సంస్కరణలు, జనంపై భారాల చుట్టూనే పాలన సాగుతోంది. తాము చేపట్టిన సంస్కరణల వలన వృద్ధి రేటు పెరుగుతుందని ఊదరగొడుతుండగా వాస్తవాలను దాచిపెట్టేలా మసిపూసి మారేడు కాయ చేసిన తీరు స్పష్టంగా గోచరిస్తోంది. దేశంలో ప్రజల జీవనస్థితిగతులను గమనిస్తే మనం ఎంత అధ్వాన్నమైన ఆర్థిక వ్యవస్థలో కూరుకుని పోయామో గమనించ వచ్చు. సగటు మనిషటి దగ్గరికి వెళ్లి బతుకును ప్రశ్నిస్తే మన బండారం బయటపడుతుంది. లెక్కలు వేయడం గొప్పతనం కాదు. లెక్కలకు అనుగుణంగా దేశం ముందుకు వెళుతుందా లేదా అన్న లెక్కలు తీయాలి. లెక్కలు వేసి పేపర్లపై చూపినంత మాత్రాన ప్రజల జీవనస్థితిగతులు మారవు. అలాంటి ప్రయత్నాలు చేస్తే ప్రజలు బిజెపిని నమ్మరు. బిజెపిపై ప్రజలకు ఇంతకాలం ఒక ఇమేజ్ ఉండేది. కానీ గత ఎనిమిదేళ్లుగా ఆ ఇమేజ్ పూర్తిగా తొలగిపోయింది. వారు ఇతరులకన్నా ఎక్కువే తప్ప ప్రత్యేకం కాదని మోడీ సేన నిరూపించింది. ఉపాధి, ఉద్యోగాల కల్పన, వ్యవసాయాభివృద్ధి, విద్య,వైద్యం వంటి సమస్యలను దేశం తీవ్రంగా ఎదుర్కొంటున్న వేళ ఈ నాలుగేళ్లలో ఇసుమంత మార్పుకూడా గోచరించ లేదు. మోడీ సర్కారు వచ్చాక అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పటికీ ప్రజలకు భారంగా మారిన పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గలేదు సరికదా రోజువారీ విధానాలతో వాహనదారుల నడ్డి విరిచారు. ఏడాదికి కోట్లల్లో కొత్త ఉద్యోగాలు సృష్టిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన బిజెపి ఇచ్చిన కొత్త ఉద్యోగాలెన్నని అడిగితే చెప్పలేని పరిస్థితిలో ఉంది. రాజకీయ సంకల్పం ఉంటే, ధృఢచిత్తం ఉంటే సాధించనిదేమీ లేదు. కానీ అలాంటిదేమీ జరక్కపోగా నోట్లరద్దు, జిఎస్టీతో ప్రజల నడ్డి విరిచి కోలుకోలేకుండా చేసి అంతా అభివృద్ది సాధించామని, తాము చేపట్టిన ఈ సంస్కరణలు ఫలితం ఇస్తున్నాయని చెప్పుకోవడం దేశ ప్రజలను వంచించడం తప్ప మరోటి కాదు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో ఎవరినీ వదలం

ఇప్పటికే పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు

హోంమంత్రి మహ్మూద్ అలీ స్పష్టీకరణ

అత్యాచార ఘటనపై సిబిఐ విచారణకు కాంగ్రెస్, బిజెపి డిమాండ్

డిజిపి కార్యాలయం ముట్టడికి యూత్ కాంగ్రెస్ యత్నం



**హైదరాబాద్, జూన్ 4 (అక్షర వెలుగు):** జూబ్లీహిల్స్‌లో జరిగిన మైనర్ అత్యాచార ఘటనపై దోషులను వదిలిపెట్టమని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ లీ స్పష్టం చేశారు. ఈఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్ హజ్ హౌస్‌లో ఏర్పాటుచేసిన హజ్ యాత్రికుల వాక్సినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అత్యాచార ఘటన బాధాకరమని హోంమంత్రి పేర్కొన్నారు. నిందితులు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. ఇటు పోలీసులు కేసు దర్యాప్తు వేగవంతం చేశారని చెప్పారు. తెలంగాణ పోలీసులపై ఏ ప్రజాప్రతినిధి ఒత్తిడి లేదన్నారు. ఇదిలావుంటే ఈ ఘటనలో.. ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఈ ఘనటపై సిబిఐ విచారణకు కాంగ్రెస్, బిజెపిలుఎ డిమాండ్ చేశాయి. ఘటనను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ డిజిపి కార్యలయ ముట్టడికి ప్రయత్నించింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఓ పబ్‌కు వచ్చిన 17 ఏళ్ల బాలికతో పరిచయం చేసుకుని ఇంటికి తీసుకెళ్తామని నమ్మించి కారులోనే సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన సంచలనంగా మారింది. ఆలస్యంగా వెలుగు చూసిన శుక్రవారం ఒకరిని అదుపులోకి తీసుకోగా.. శనివారం ఉదయం మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. బాలికపై సామూహిక అత్యాచార ఘటనపై రాజకీయంగా దుమారం రేగింది. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ప్రతిపక్షాలు ధర్నాలు చేశాయి. పబ్‌లో పరిచయమైన ఒక బాలికపై ముగ్గురు బాలురు, ఇద్దరు యువకులు కారులో సామూహిక అత్యాచారం చేశారు. వీరిలో ఒక ప్రభుత్వ సంస్థకు కొత్తగా ఛైర్మన్‌గా ఎన్నికైన నాయకుడి కుమారుడు, అతడి స్నేహితులు ఉన్నారు. వీరిలో సాదుద్దీన్ మాలిక్ అనే యువకుడిని శుక్రవారం రోజున పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో ముగ్గురిని కర్ణాటకలో అరెస్టు చేసినట్లు తెలిపారు. కర్ణాటకలో తల దాచుకున్న ఉమర్‌ఖాన్ అనే వ్యక్తితో పాటు మరో ఇద్దరు మైనర్‌లను అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. ఆరు రోజుల కిందట ఈ ఘటన చోటుచేసుకోగా.. భయంతో బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పలేదు. ఆమె శరీరంపై గాయాలు చూసి.. తండ్రి ఫిర్యాదు చేయగా, జూబ్లీహిల్స్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బాలిక షాక్ నుంచి తేరుకున్నాక.. భరోసా కేంద్రంలో మహిళా పోలీసులు బుధవారం రాత్రి ఆమెతో అనునయంగా మాట్లాడడంతో వాస్తవం బయటికొచ్చింది. తనపై కొందరు సామూహిక అత్యాచారం చేశారంటూ ఆమె విలపించింది. దీంతో పోలీసులు అత్యాచారం సెక్షన్లు జోడించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారు ప్రజాప్రతినిధుల సంతానమైనందునే పోలీసులు చర్యలు తీసుకోవడంలేదంటూ కాంగ్రెస్, భాజపా నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ పోలీసు ఠాణా వద్ద శుక్రవారం సాయంత్రం ధర్నా చేశారు. హోంమంత్రి మహమూద్ అలీ మనవడు పుర్ఖాన్ కూడా నిందితుల్లో ఉన్నారంటూ ప్రచారమవగా, తనకు సంబంధం లేదంటూ పుర్ఖాన్ ఖండించారు. ఈఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. బాలికపై అత్యాచార ఘటనపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుపట్టారు. నిందితులను రక్షించడానికి పోలీస్‌శాఖ కేసును పక్కదోవ పట్టిస్తోందని ఆరోపించారు. బాలికపై అఘాయిత్యం కేసులో ఎలాంటి అనుమానాలకు తావు ఇవ్వకుండా.. నిందితులకు అండగా లేమనే అపవాదును తొలగించుకోవాలని సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. పలుకుబడిన వారి కుటుంబసభ్యుల ప్రమేయం ఉన్న ఘటనలో పోలీసులు నిష్పాక్షికంగా ఎలా దర్యాప్తు చేయగలరని ప్రశ్నించారు. బాలికపై అత్యాచారం కేసులో సీబీఐతో విచారణ జరిపించకపోతే న్యాయపోరాటం చేసి బాధితులకు అండగా ఉంటామన్నారు. రాష్ట్రంలోని పబ్బులను మూసివేయాలని కోరారు. శాంతిభద్రతల సమస్యపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని బండి సంజయ్ పేర్కొన్నారు. నగరంలో సంచలనం సృష్టించిన బాలిక రేప్ కేసును సీబీఐకి అప్పగించాలని కాంగ్రెస్ నేత దుద్దిళ్ల శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. ఇక్కడి వ్యవస్థపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. ప్రభుత్వ నిర్లిప్తత వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. మర్డర్, రేప్‌లు జరుగుతున్నా దోషులను పట్టుకోవడం లేదని, వారు బయట దర్జాగా తిరుగుతున్నారని శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్‌ను నిరసిస్తూ డీజీపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యూత్ కాంగ్రెస్ నాయకులు యత్నించారు. కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా... పోలీసులు అడ్డుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోత రోహిత్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. యూత్ కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మోత రోహిత్ మాట్లాడుతూ... మీడియాలో వచ్చే వరకు పోలీసులు స్పందించకపోవడం హాస్యాస్పదమన్నారు. నాలుగు రోజుల తర్వాత మంత్రి కేటీఆర్ నిందితులను శిక్షించాలని హోం మంత్రిని ఆదేశించడం విడ్డూరమని తెలిపారు. నిందితులను గుర్తించి శిక్షించడంలో విఫలమైన పోలీసు యంత్రాంగం అందుకు బాధ్యత వహిస్తూ కేటీఆర్, హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీజీపీ స్పందించి అసలైన దోషులను అదుపులోకి తీసుకొని శిక్షించాలన్నారు. బాధిత బాలికకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని మోత రోహిత్ స్పష్టం చేశారు.

# సిఎస్ సోమేశ్ కుమార్‌తో యూపి అధికారుల భేటీ



(మొదటి పేజీ తరువాయి) లభించిందని ఉత్తరప్రదేశ్ అధికారులు తెలిపారు. తెలంగాణా ప్రభుత్వ ఉత్తమ విధానాలను తమ రాష్ట్రంలో కూడా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమీషనర్ ఎస్. మినిస్టి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమీషనర్ నీతూ ప్రసాద్, ఐఐటీ హైదరాబాద్ కు చెందిన అదనపు కమీషనర్లు సాయి కిషోర్, కాశి, శోభన్ బాబు లతోపాటు ఉత్తరప్రదేశ్ కు చెందిన కమర్షియల్ టాక్స్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణపై కొనసాగుతున్న కేంద్రం వివక్ష



(మొదటి పేజీ తరువాయి) ముక్కు నెలకు రాస్తారా? అంటూ సవాల్ విసిరారు. పాలమూరు-రంగారెడ్డికి ప్రధాని జాతీయ హోదా ఇస్తామని చెప్పారని, ఎనిమిదేళ్లలో ఒక్క పైసా ఇవ్వలే దని.. వికారాబాద్, కర్నాటక, గద్వాల-మాచర్లకు రైలు అడిగినా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. కృష్ణానదిలో తెలంగాణకు 575 టీఎంసీల నీటివాటా ఇవ్వడంలో కేంద్రం తాత్సారం చేస్తుందని ఆరోపించారు. పాలమూరులో 8లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే నని అన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాకనే పాలమూరులో వలసలు తగ్గాయని గుర్తు చేశారు. మంచి మంచి సంక్షేమ పథకాలతో పేదలకు ప్రభుత్వం అండగా ఉన్నదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం తో కొట్లాడి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నిధులు తీసుకొచ్చారని, నియోజకవర్గంలో వెంకటేశ్వర్‌రెడ్డి 21 చెక్‌డ్యాంలు కట్టించార న్నారు. కొత్తకోట మున్సిపాలిటీకి త్వరలో రూ.4 కోట్లు మంజూరు చేస్తామన్నారు. దేవరకద్రను మున్సిపా లిటీ ఏర్పాటు చేసి, నిధులు మంజూరు చేస్తామన్నారు. ఫ్లలెటూర్లకు అపార్ట్‌మెంట్లు తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. పేదవాడి ముఖంలో ఆనందం చూడటమే తమ పార్టీ ధ్యేయ మన్నారు. ఈ ఏడాది నుంచే డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, 3వేల మందికి.. 3లక్షలు అందించ నున్నట్లు కేటీఆర్ వివరించారు.

# బండికి దమ్ముంటే

## కేంద్రం నుంచి నిధులు తేవాలి



(మొదటి పేజీ తరువాయి) కొత్త ఫించన్లు ఇవ్వలేకపోయామని..వచ్చే నెల నుంచే 57 ఏళ్ళు నిండిన వారికి కొత్త ఫించన్లు ఇస్తామని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. టీఆర్ఎస్ పాలనలో గ్రామీణ ప్రాంతాలు ఎంతో బాగుపడ్డాయని..ఇంటింటికి తాగునీరు ఇచ్చిన మహానుభావుడు కేసీఆర్ అని కొనియాడారు. త్వరలో సొంత స్థలాలున్నవారికి ఇంటి నిర్మాణానికి 3.10 లక్షలు ఇస్తామని ప్రకటించారు. మల్కాపూర్ గ్రామానికి కోటి నిధులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ మేమే ఇచ్చామని కాంగ్రెస్ వాళ్ళు చెబుతున్నారు.. మరి దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చింది బ్రిటీష్ వాళ్ళే అంటే ఒప్పుకుంటారా? అని ప్రశ్నించారు. పల్లెల్లో అభివృద్ధి చూసి ప్రజలు మురవాలన్నది కేసీఆర్ ఆశయమని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు..తర్వాత ఎలాంటి మార్పులు వచ్చాయో ప్రజలు గమనించాలన్నారు. పండగ వాతావరణంలో పల్లె ప్రగతి కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. టీఆర్ఎస్ వల్లే తెలంగాణ వచ్చిందని అన్నారు. నిధులడిగితే ఆనాటి సీఎంలు వెకిలిగా నవ్వారు కానీ కేసీఆర్ మాత్రం అడిగినన్ని నిధులిస్తున్నట్లు తెలిపారు. గతంలో కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల భారిన పడేవారు కానీ టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితిలో మార్పు వచ్చిందన్నారు. మన దేశంలో తెలంగాణలో మాత్రమే మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు అందిస్తున్నామన్నారు. గతంలో ఆడపిల్ల పెళ్ళికి డబ్బులు దొరకక ఆస్తులమ్ముకుంటే ఇప్పుడు కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆడపిల్ల పెళ్లికి లక్ష రూపాయలు ఇస్తున్నట్లు వివరించారు.

# తెలంగాణకు మోడీ చేసిందేమీ లేదు



(మొదటి పేజీ తరువాయి) ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కొత్త జిల్లాతో పాటు జిల్లా కోర్టులను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. పల్లె, పట్టణాల్లో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్లలె, పట్టణ ప్రగతిలో అందరూ పాల్గొని తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని సీజనల్ వ్యాధుల భారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్లలె ప్రకృతి కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని, కొన్ని వార్డుల్లో అనుకున్న స్థాయిలో పనులు జరగడం లేదని, అధికారులు అలసత్వం వీడాలన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి జరిగిన అభివృద్ధిని చూస్తే ప్రధాని మోదీ ప్రభుత్వం తెలంగాణ ప్రాంతానికి చేసిందేమీ లేదని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో రాష్టాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తున్నారని, అది చూసి ఓర్వలేకే కేంద్రం.. తెలంగాణపై వివక్ష చూపుతుందని చెప్పారు. మన రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధులను కూడా కేంద్రం ప్రభుత్వం కేటాయించడం లేదన్నారు. పన్నుల రూపంలో మన పైసలు కేంద్రం తీసుకుపోతుందే తప్పా.. కేంద్రం మనకు నిధులు ఇచ్చింది లేదని స్పష్టంచేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలతో, ఆ పార్టీ నేతలతో రాష్ట్రానికి ఒరిగింది శూన్యమని మండిపడ్డారు.

# తెలంగాణలో కులవృత్తులకు పెరిగిన ప్రాధాన్యం



(మొదటి పేజీ తరువాయి) నిలిచిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా దళితబంధు పథకం కింద ఒక్కో లబ్దిదారుడికి లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధిని మరిచి నేడు ప్రభుత్వంపై విమర్శలు సిగ్గుచేటన్నారు. ప్రధాని దేశానికి ఏం చేశారంటే.. రోజుకు ఐదుజతల బట్టలు మారుస్తారు.. తెలంగాణలో 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నాం.. మీ గుజరాత్‌లో ఇస్తున్నారా? ప్రభుత్వాన్ని రద్దు చేసి ఎన్నికలకు వెళ్లే ధైర్యం మీకుందా? అంటూ మంత్రి సవాల్ విసిరారు. రాష్ట్రానికి ఇవ్వాల్సిన రూ.1400కోట్లు ఇవ్వకుండా ప్రభుత్వాన్ని బదనాం చేసే ప్రయత్నం బీజేపీ చేస్తుందని మండిపడ్డారు.

# హాపూర్ జిల్లాలో భారీ పేలుడు

## రసాయనిక ఫ్యాక్టరీలో పేలుడుకు 8మంది మృతి

**లక్నో, జూన్ 4 (అక్షర వెలుగు):** ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ జిల్లాలో శనివారంనాడు భారీ పేలుడు సంభవించింది. ధోలానా ప్రాంతంలోని రసాయనిక ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ఈ ప్రమాదంలో 8 మంది కార్మికులు సజీవదహనమయ్యారు. మరో 15 మంది వరకూ గాయపడ్డారు. సహాయక చర్యలు కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు. కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఘటనా స్థలిలో తక్షణ సహాయక చర్యలు చేపట్టి, బాధితులు, వారి కుటుంబాలను అన్నివిధాలా ఆదుకోవాలని జిల్లా యంత్రాగాన్ని సీఎం ఆదేశించారు. కాగా, ఫ్యాక్టరీ బాయిలర్‌లో పేలుడు జరగడంతో ఆరుగురు కార్మికులు మరణించినట్టు రాష్ట్ర మంత్రి నంద్ గోపాల్ గుప్తా ఒక ట్వీట్‌లో తెలిపారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక విభాగం.. ఆరు అగ్నిమాపక యంత్రాలతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది. పేలుడు దాటికి పరిశ్రమ పూర్తిగా ధ్వంసమైంది.

# వరుస ఘటనలు జరుగుతున్నా చర్యలేవీ

(మొదటి పేజీ తరువాయి) సరఫరా చేస్తున్నారు? పబ్‌లపై నియంత్రణ ఎందుకు లేదు? దమ్ముంటే కేసును సీబీఐ దర్యాప్తుకు అప్పగించండని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం ప్రతిపక్షాలపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ప్రతిపక్షాలను కట్టడి చేయడం కోసం ఈడీని ఉపయోగిస్తున్నారు. 1978లో ఇందిరాగాంధీ మీద కూడా కక్ష సాధింపు చర్యలకు దిగితే ప్రజలు తిరగపడ్డారు. నేషనల్ హెరాల్డ్ పేపర్ దేశ స్వతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించింది. దేశం కోసం ఆస్తులనే రాసిచ్చిన కుటుంబం సోనియా, రాహుల్‌ది. అలాంటి వారి మీద కేసు పెడతారా? భయపెట్టి మరోమారు అధికారంలోకి రావాలని అనుకుంటున్నారు. ఈడీ నోటీస్‌లకు భయపడతారనుకుంటే పొరపాటే. జాగ్రత్త దేశం మొత్తం తిరగ బడుతుందని భట్టి హెచ్చరించారు.

## మేలుకొలుపు పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కమ్మరి కత్త గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు



**మెదక్, జూన్ 4 (అక్షర వెలుగు):** మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో ప్రజల్లో అవగాహన కల్పించడానికి మెదక్ జిల్లా పోలీస్ కళాబృందం వారు జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశానుసారం గ్రామాల్లో ప్రజలకు యువతకు పలు అంశాలపై అవగాహన కల్పించడానికి టేక్మాల్ ఎస్ఐ బి లింగం ఆధ్వర్యంలో మండల పరిధిలోని కమ్మరి కత్త గ్రామంలో మూఢనమ్మకాలు, బాల్య వివాహాల నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి, సమాజంలో యువత యొక్క ప్రాముఖ్యత నడవడిక ఎలా ఉండాలి అని కళా బృందం వారిచే అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై బి లింగం మాట్లాడుతూ గ్రామాలలో ముఖ్యంగా యువత మద్యం మత్తుకు బానిస అవుతున్నారని తద్వారా పలు చోరీలకు పాల్పడుతున్నారని అలాగే 15 సంవత్సరాల ఆడ పిల్లలు పెళ్లిళ్లు చేయడం సరికాదని గతంలో ఇలాంటి సంఘటనలు గ్రామంలో వెలుగు చూశాయని, ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ఒకవేళ నడిపినచో కఠిన చర్యలు తప్పవని మరియు ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి ఎంతోమంది బాధితులు తమ ఖాతాలో నుండి డబ్బులు పోయాయి కేసులు పెడుతున్నారని ఇటీవల మండల పరిధిలో ఒక్క బాధిత కుటుంబం 35 లక్షల లక్కీ డ్రా వచ్చింది అని చెప్పి సదరు సైబర్ నేరగాలు ఫోన్ చేసి ఓటిపి లు చెప్పమని అడిగితే వారు చెప్పడంతో లక్ష రూపాయల వరకు బాధితులకు తేలవకుండానే అకౌంట్ లో నుండి డబ్బులు విడుదలైనట్లు ఇట్టి విషయాన్ని లేటుగా తెలుసుకొని పోలీసులను ఆశ్రయించారాన్ని అని ఆయన తెలపడం జరిగింది. ఆడపడుచులు రాత్రింబవళ్లు అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా అనుమానంగా గ్రామంలో కనపడితే వెంటనే పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని అని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మల్లయ్య, గ్రామ సర్పంచ్ చంద్రయ్య, పోలీస్ కళాబృందం ఇన్చార్జ్, సురేందర్, వరప్రసాద్, జనార్ధన్, అవినాష్ శ్రీనివాస్, టేక్మాల్ పోలీస్ సిబ్బంది సాయిలు, రవీందర్, గ్రామ పాలక వర్గం సభ్యులు యువకులు పిల్లలు పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ప్రకాష్




**సంగారెడ్డి, జూన్ 4 (అక్షర వెలుగు):** సంగారెడ్డి జిల్లా స్వేరో స్టూడెంట్ యూనియన్ రివ్యూ మీటింగ్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన జిల్లా అధ్యక్షుడిగా ప్రకాష్ ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్ గల్లా ఎన్నికయ్యారు. ఉప అధ్యక్షులుగా రాహుల్ , విద్యాసాగర్. ఎన్నికయ్యారు. దీనికి ముఖ్య అతిథిగా వచ్చినటువంటి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. కాగా రాజ్ కుమార్ మాట్లాడుతూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలుపుతూ ఎస్ ఎస్ యు ప్రతి విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందని సమస్య ఎక్కడ ఉంటే ఎస్ ఎస్ యు అక్కడ ఉంటుందని అన్నారు. కాగా ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా మాజీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు భానుతేజ వ్యవహరించారు. అనంతరం. , ప్రకాష్ మాట్లాడుతూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలుపుతూ, నాకు ఇచ్చిన పదవికీ సమన్వయ న్యాయం చేస్తనని తెలిపారు. ప్రతి గల్లికి ప్రతి విద్యార్థి దగ్గరకు ఎస్ ఎస్ యు వెళ్లి తమ సమస్యలను పరిష్కారనికి పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నెలాఖరులో ఆషాడ బోనాలు

### 6న ఉత్సవాలపై తలసాని సమీక్ష



**హైదరాబాద్, జూన్ 4 (అక్షర వెలుగు):** ఈ నెలాఖరు నుంచి ఆషాఢ బోనాల వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 6న వేడుకలపై రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సమీక్ష సమావేశం జరుగనున్నది. సమావేశానికి హోంమంత్రి మహమూద్ అలీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, జీహెచ్ఎంసీ పరిధిలోని రాజ్యసభ, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, బోనాల ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు హాజరుకానున్నారు. అలాగే హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పోలీస్ కమిషనర్లు, దేవాదాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## కోటి ఆస్పత్రిలో మంత్రి హరీష్ ఆకస్మిక తనిఖీ

(మొదటి పేజి తరువాయి) సక్రమంగా అందుతున్నాయని రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. దవాఖానాలో రోగులు, అటెండెంట్లకు అందిస్తున్న ఆహారంపై మంత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డైట్ చార్జీలు పెంచి చక్కటి పౌష్టికాహారం అందిస్తున్నట్లు వెల్లడించారు. రోగులకే కాకుండా హైదరాబాద్ పరిధిలో 18 ఆసుపత్రుల్లో రోగుల సహాయకులకు రూ.5 చక్కటి భోజన సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందని, దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆరోగ్య పరీక్షలు, బ్లడ్, ఆక్సిజన్ వంటి అత్యవసర సదుపాయాలు దవాఖానాలో ఉన్నాయో లేవో పరిశీలించారు. అత్యవసర మందులు, బ్లడ్ కోసం రోగులను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటికి పంపొద్దని 24 గంటలు హాస్పిటల్‌లో అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. కావాల్సిన మందులు ఎప్పటికప్పుడు తెప్పించుకోవాలని సూచించారు. ఇంకా ఎలాంటి మెరుగైన సేవలు కావాలో రోగులను అడిగి తెలుసుకుని, వాటిని కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా పనిచేయాలని, నిధులకు వెనకాడకుండా అన్ని ఆధునిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణలో అలక్ష్యం వద్దని, ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణకు అయ్యే చార్జీలను పెంచిందని, కాబట్టి పారిశుధ్య నిర్వహణ చక్కగా ఉండాలని ఆదేశించారు.

## కృషి, పట్టుదలతో ఉద్యోగాలు కొట్టాలి

### ఉచిత కోచింగ్ సెంటర్‌ను సందర్శించిన మంత్రి జగదీశ్ రెడ్డి



**సూర్యాపేట, జూన్ 4 (అక్షర వెలుగు):** ఉద్యోగార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చిత్తశుద్ధితో పనిచేసి కొలువుల సాధించాలని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. కృషి, పట్టుదల, ఓర్పుతో గమ్యాన్ని చేరుకోవాలన్నారు. శనివారం హుజూర్‌నగర్ లో అంకిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగార్థులకు అందిస్తున్న ఉచిత కోచింగ్ సెంటర్‌ను మంత్రి జగదీశ్ రెడ్డి సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సెల్ ఫోన్, నిద్ర ,అలసత్వం, వాయిదా లాంటి శత్రువులను జయిస్తే లక్ష్యం చేరువ అవుతుందన్నారు. చదువు ఉద్యోగం కొరకు కాదని జీవితంలో ముందుకు సాగడానికి విద్యార్థుల సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఉద్యోగాలు వచ్చినా రాకపోయినా, జీవితం అయిపోయిందని తొందరపడి ఆత్మహత్యలు లాంటివి చేసుకోవద్దన్నారు. ప్రపంచంలోని ఏ దేశంలోనైనా 5 శాతానికి మించి ప్రభుత్వ ఉద్యోగాలు లేవని తెలిపారు. తల్లిదండ్రుల పట్ల గౌరవంగా మెలుగుతూ జీవితంలో ఎంచుకున్న మార్గంలో కాదు, ఒక ఆయుధంగా ఎంచుకొని ఉద్యోగార్థులు విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, జెడ్పీ చైర్మన్ దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్ గిల్లీ అర్చన, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ పథకాలు దేశానికి ఆదర్శం

### బిజెపి పాలనలో ఒరిగిందేమీ లేదు: వేముల



**నిజామబాద్, జూన్ 4 (అక్షర వెలుగు):** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్లలె ప్రగతికార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. దేశానికి ఆదర్శంగా కెసిఆర్ కార్యక్రమాలు ఉన్నాయని అన్నారు. విద్యుత్, వ్యయసాయ రంగాలను అభివృద్ధి చేసిన ఘనత దేశంలో కెసిఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించి మంత్రి ఈ మేరకు మాట్లాడారు. ఇప్పుడుస్వరాష్ట్రం కేసీఆర్ పాలనలో ప్రతి పల్లె అభివృద్ధి పథాన పయనిస్తుందన్నారు. ఈమధ్య దేశంలో 20 ఉత్తమ పంచాయతీలను గుర్తించగా అందులో 19 గ్రామాలు తెలంగాణ రాష్ట్రంలోని కావడం ఇక్కడ జరుగుతున్న అభివృద్ధికి నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారం మోపుతోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత గ్రామాలను అభివృద్ధి బాట పట్టించేందుకే సీఎం కేసీఆర్ పల్లెప్రగతికి రూపకల్పన చేశారన్నారు.

## కెసిఆర్ లాంటి నేత దేశానికి అవసరం

### అప్పుడే దేశం అభివృద్ధి చెందగలదు

### బిజెపితో దేశం కుటుంపడుతోంది

### పల్లెప్రగతి కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి



**కరీంనగర్, జూన్ 4 (అక్షర వెలుగు):** కేసీఆర్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం మన అదృష్టమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సీఎం కేసీఆర్‌లా దేశంలో ఎవ్వరూ రైతుల అభివృద్ధికి పాటుపడటం లేదన్నారు. దేశంలో కెసిఆర్ నాయకత్వం ఇప్పుడు అవసరమన్నారు. పల్లె ప్రగతితో గ్రామాలు బాగుపడ్డాయని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పెరిగిందని, దీంతో రోగాలు మాయమైపోయాయని చెప్పారు. ఊర్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. పల్లెప్రగతిలో భాగంగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి మినీ స్టేడియాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు బీజేపీ పాలిత ప్రాంతాల్లో ఎక్కడైనా ఉన్నాయో చూపించాలని డిమాండ్ చేశారు. పంచాయతీలకు కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు రావడం లేదని, గ్రామాలకు కేంద్రం నిధులు ఇవ్వకపోతే బండి సంజయ్ భరతం పడతామని హెచ్చరించారు. తెలంగాణపై కనీస అవగాహన లేకుండా కేంద్ర మంత్రి అమిత్‌షా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అంటే అబద్దాల పార్టీ అని విమర్శించారు. ఉరాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేకే కేంద్రం విషం చిమ్ముతున్నదని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రాష్ట్ర ఏర్పాటు ముందు ఇక్కడ అన్ని ఇబ్బందులు ఉండేవని, కానీ తెలంగాణ వచ్చిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. సాగునీరు, పంటల పెట్టుబడి, బీమా, కల్తీలేని విత్తనాలు, ఇంటింటికీ నల్లా నీళ్లు, కోతలు లేకుండా 24 గంటలు కరెంటు ఇస్తున్నామని చెప్పారు. పల్లె ప్రగతి సాధించిన ప్రగతి ఎంతో ఉందని, ఈ కార్యక్రమంతో ప్రతి ప్లలెలో పండగ వాతావరణం ఏర్పడిందని చెప్పారు. గ్రామాల్లో గతంలో, ప్రస్తుత పరిస్థితులను అంచనా వేయాలని సూచించారు.

## పంజాబ్‌లో కాంగ్రెస్‌కు మరింత దెబ్బ

### కాషాయం గూటికి పలువురు మాజీమంత్రులు

**న్యూఢిల్లీ, జూన్ 4 (అక్షర వెలుగు):** కాంగ్రెస్ పార్టీకి పంజాబ్‌లో మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ప్రముఖ నేత సునీల్ జాఖడ్ ఇటీవల కాంగ్రెస్ పార్టీని వీడిన నేపథ్యంలో మరో ఐదుగురు ప్రముఖ నేతలు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. పంజాబ్ మాజీ మంత్రులు గురుప్రీత్ సింగ్ కంగర్, బల్బీర్ సింగ్ సంధూ, రాజ్ కుమార్ వెర్కా, సుందర్ శ్యామ్ అరోరా, మాజీ ఎమ్మెల్యే కేవల్ సింగ్ ధిల్లాన్ శనివారం కాషాయ పార్టీ గూటికి చేరారు. గత నెలలో పంజాబ్ కాంగ్రెస్ మాజీ చీఫ్ సునీల్ జాఖడ్ ఆ పార్టీకి రాజీనామా చేసి కాషాయ పార్టీలో చేరిన తర్వాత పెద్దసంఖ్యలో నేతలు కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరుతున్నారు. ఇక పంజాబ్ కాంగ్రెస్‌లో వలసల పర్వానికి తెరపడకపోవడం పార్టీ అగ్ర నాయకత్వానికి ఆందోళన కలిగిస్తోంది.

## వీడియోలు, ఫోటోలు బయటపెట్టిన బిజెపి



(మొదటి పేజి తరువాయి) చేయాలంటూ బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మట్లాడుతూ.. గ్యాంగ్ రేప్ చేసిన వారిని ఎందుకు సీక్రెట్‌గా దాస్తున్నారని మండిపడ్డారు. నిర్భయ కేసులో మైనర్ల పేర్లు బయటకు వస్తున్నాయి..మరి నిందితుల ఫోటోలు ఎందుకు చూపించడంలేదని ఆయన ప్రశ్నించారు. అసలు ఈ కేసులో నిందితులు మైనారా.. మేజరా.. అన్నది కాదు అన్నారు. పోలీసులు నిందుతులను బహిరంగంగా అరెస్టు చేసినట్లు ఎక్కడా రాలేదు. పోలీసులకు భయపడేవారు ఎవరూ లేరు అన్నారు. ఎందుకు వారిని సీక్రెట్ గా ఉంచుతున్నారని రఘునందన్ ప్రశ్నించారు. అవసరమైతే టీఆర్ఎస్ వాళ్లను రిమాండ్ చేస్తారు కానీ ఎంఐఎంను ఎందుకు చేయరు అని అన్నారు. ఈ కేసులో నిందితులెవరో తెలుసుకోవాలనుకుంటున్నామని ఆయన డిమాండ్ చేశారు. రెడ్ కలర్ మెర్సిడెస్ బెజ్ కారులో ఈ ఘటన జరిగింది. కానీ పోలీసులు ఇన్నోవాలో ఉన్నవారి అరెస్టు చేశారు. ఈ కేసులో ఎంఐఎం ఎమ్మెల్యే కుమారుడు,హోం మంత్రి మనవడు ఉన్నారు..రెడ్ కల్లర్ బెంజ్ కారులో ఏం జరిగిందో మా దగ్గర వీడియోలు ఉన్నాయన్నారు. ఈ కేసులో దోషులను అరెస్టు చేసి శిక్ష విధించేదాక పోరాడుతామని రఘునందన్ హెచ్చరించారు. మైనర్ బాలికపై అత్యాచార వీడియోలు ఎమ్మెల్యే రఘునందన్ రావు విడుదల చేసారు ఇదిలావుంటే అమ్నీషియా పబ్ అత్యాచార ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌కు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ బహిరంగ లేఖ రాశారు. అత్యాచార ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాధాకరంగా ఉందని, నాలుగు రోజులు గడుస్తున్నా పోలీస్ శాఖ పనితీరు అనుమానాకు తావిస్తోందని లేఖలో ఆయన ఆరోపించారు. ఈ ఘటనలో కేసీఆర్ రాజకీయ మిత్రుల వారసుల పేర్లు ప్రముఖంగా మీడియాలో, సోషల్ మీడియాలో వినిస్తున్నాయని తెలిపారు. అనుమానాలు నివృత్తి చేసి.. సంఘటనపై స్పష్టత ఇప్పించాలని తెలంగాణ బీజేపీ తరపున కోరుతున్నట్లు లేఖలో బండి సంజయ్ పేర్కొన్నారు.

## పట్టణాలను స్వచ్ఛంగా మార్చేందుకే పట్టణ ప్రగతి



(మొదటి పేజి తరువాయి) రూ.18లక్షల నిర్మించిన వరద నీటి కాలువను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జల్‌పల్లి అంగన్‌వాడీ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ పట్టణ ప్రగతిలో భాగంగా ప్రతి నెలా మున్సిపాలిటీకి రూ.36లక్షల నిధులు వస్తున్నాయన్నారు. జిల్లాలోని మొత్తం 16 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు కలిపి ప్రతి నెలా రూ.2.12కోట్లు నిధులు మంజూరు చేస్తున్నామని, ఇప్పటి వరకు రూ.57.14కోట్ల నిధులు వచ్చాయన్నారు. కౌన్సిలర్లు తమ, తమ వార్డుల్లో ఒక వాహనం నలుగురు సిబ్బందితో చెత్తను తొలగించేలా చూడాలన్నారు. చెత్త రహిత మునిసిపాలిటీగా జల్‌పల్లి మునిసిపాలిటీని తీర్చిదిద్దుదామన్నారు. పట్టణ ప్రగతి ద్వారా చేపడుతున్న కార్యక్రమాలతో నేడు సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయన్నారు. మునిసిపాలిటీల్లో 1.20లక్షల మొక్కులు నాటే లక్ష్యంతో పని చేయాలన్నారు. అన్నివార్డుల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. స్థలాలు ఎంపిక చేసుకొని వెంటనే వివిధ క్రీడలకు సంబంధించిన కోర్టులను సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెద్ద ఎత్తున పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, నమోదుశాతాన్ని పెంచాలన్నారు. మునిసిపాలిటీ పరిధిలో పహాడి షరీఫ్, షాహీన్ నగర్, కొత్తపేట్, జల్‌పల్లి, శ్రీరామ్‌నగర్‌లలో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్ సాధి, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కమిషనర్ జీపీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అదృశ్యమైన వ్యక్తి శవం గుర్తింపు

### దారుణంగా హత్య చేసినట్లుగా అనుమానం

**నల్లగొండ, జూన్ 4 (అక్షర వెలుగు):** జిల్లాలోని కట్టంగూరు మండలంలో దారుణం జరిగింది. ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. గత ఐదు రోజులుగా కనిపించకుండా పోయిన వ్యక్తి శవమై తేలాడు. అయిటిపాములకు చెందిన రాజశేఖర్ (27) అనే యువకుడు గత నెల 31వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడు. శనివారం ఉదయం రామచంద్రగూడెం శివారులో అతని మృదేహాన్ని పోలీసులు గుర్తించారు. తోటి స్నేహితుడే హతమార్చినట్టు అనుమానిస్తున్నారు. అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆర్థిక లావాదేవీల వ్యవహారంలో రాజశేఖర్‌ను హతమార్చినట్టు సమాచారం. హత్య అనంతరం నిందితుడు మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు తెలుస్తున్నది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు




# చలన చిత్రం

## వసూళ్లలో దూసుకుపోతున్న మేజర్



26/11 ముంబై టెర్రర్ అటాక్స్ రియల్ హీరో మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ స్ఫూర్తిదాయకమైన జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'మేజర్'. ఇందులో వర్సటైల్ హీరో అడివి శేష్ టైటిల్ రోల్ పోషించారు. కరోనా పాండమిక్ కారణంగా వాయిదా పడుతూ వచ్చిన ఈ బయోపిక్ శుక్రవారం థియేటర్లలోకి వచ్చింది. ప్రివ్యూలతోనే పాజిటివ్ రెస్పాన్స్ తెచ్చుకున్న ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. ఈ నేపథ్యంలో 'మేజర్' సినిమా ఫస్ట్ డే వరల్డ్ వైడ్ గా రూ. 13.4 కోట్లు గ్రాస్ కలెక్షన్స్ రాబట్టినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇది శేష్ కెరీర్ లో బిగ్గెస్ట్ ఓపెనర్. ఇక హిందీ బెల్ట్ లో దాదాపు 1 కోటి వసూలు చేసి బాక్సాఫీస్ వద్ద సాలిడ్ గా నిలిబడింది. ఓవర్సీస్ లోనూ ఈ సినిమా మంచి వసూళ్లను రాబడుతోంది. మౌత్ టాక్ - పాజిటివ్ రివ్యూలతో రాబోయే రోజుల్లో మరిన్ని వసూళ్ళు అందుకునే అవకాశం ఉంది. ముంబై దాడుల్లో సందీప్ ప్రాణాలు త్యాగం చేసారని అందరికి తెలుసు. కానీ ఆయన ఎలా జీవించాడు? ఆయన కుటుంబ నేపథ్యం ఏంటి? బాల్యం ఎలా సాగింది? ఆర్మీలో చేరడానికి అతనికి స్ఫూర్తి కలిగించిన అంశాలేంటి? అనేది ఈ సినిమాలో చూపించారు. తల్లిదండ్రులపై మేజర్ కి ఉన్న ప్రేమ.. యవ్వనంలో లవ్ స్టోరీ.. దేశం పట్ల ఆయనకున్న ప్రేమను.. ఆర్మీలో చేరిన తర్వాత ఉన్నత స్థాయికి ఎదగడానికి పడిన కష్టాన్ని.. ప్రాణాలకు తెగించి ఉగ్రమూకలను మట్టుబెట్టడం.. ప్రజల ప్రాణాలను రక్షించేందుకు తన ప్రాణాలను పణంగా పెట్టడం.. ఇలా ప్రతీదీ కళ్లకు కట్టినట్లు తెరపై ఆవిష్కరించారు. 'మేజర్' నిర్మాణంలో సూపర్ స్టార్ మహేశ్ బాబు కూడా పాలుపంచుకోవడంతో ఈ సినిమాపై రిలీజ్ కు ముందే భారీ హైప్ క్రియేట్ అయింది. దీనికి తగ్గట్టుగానే అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. సందీప్ ఉన్ని కృష్ణన్ పాత్రలో అడివి శేష్ జీవించాడనే చెప్పాలి. ఎమోషన్స్ పలికిస్తూనే.. హీరోయిజాన్ని తెరపై చూపిస్తూ తన పాత్రకు వందశాతం న్యాయం చేశాడు.

## అంటే సుందరానికీ'




### మూవీకి సెన్సార్ పూర్తి

నేచురల్ స్టార్ నాని, నజ్రియా ఫహద్ జంటగా నటించిన తాజా చిత్రం 'అంటే సుందరానికీ' మూవీకి సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించారు. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమా జూన్ 10న ప్రపంచ వ్యాప్తంగా మూడు భాషల్లో ఒకేసారి విడుదలకాబోతోంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రానికి సెన్సార్ కార్యక్రామలను పూర్తి చేసుకొని క్లీన్ యూ సర్టిఫికెట్‌ను పొందింది. ఇక చిత్రయూనిట్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన టీజర్, లిరికల్స్ సాంగ్స్ ప్రేక్షకుల నుండి మంచి స్పందనను రాబట్టుకోగా.. తాజాగా విడుదలైన ట్రైలర్.. సినిమాపై మరింతగా అంచనాలను పెంచేసింది. సుందర్, లీలా థామస్ పాత్రలో నాని, నజ్రియాల ప్రేమకథ అన్నీ వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోవడం గ్యారెంటీ అనేలా ఉంది ట్రైలర్. వివేక్ సాగర్ సంగీతం అందించారు.కాగా, ఈ చిత్రం తమిళ్‌లో 'అడాడే సుందరా' అనే టైటిల్‌తోనూ, మలయాళంలో 'ఆహా సుందరా' అనే టైటిల్‌తో విడుదలవుతోంది. గత ఏడాది చివర్లో 'శ్యామ్ సింగరాయ్' సినిమాతో వచ్చి సూపర్ హిట్ అందుకున్న నాని, ఆ సినిమాకు పూర్తి భిన్నంగా 'అంటే సుందరానికీ' సినిమాతో వస్తున్నాడు. కంప్లీట్ కామెడీ ఎంటర్‌టయినర్‌గా రాబోతున్న ఈ సినిమా నానికి ఎలాంటి సక్సెస్ ఇస్తుందో చూడాలి. ఇక ఈ నేచురల్ స్టార్ ప్రస్తుతం 'దసరా' సినిమాలో నటిస్తున్నాడు. పాన్ ఇండియా మూవీగా శ్రీకాంత్ ఒదెల తెరకెక్కిస్తున్నాడు. కీర్తి సురేష్ హీరోయిన్.

## మరోమారు విజయ్ సరసన సమంత



సౌత్ సినిమా ఇండస్ట్రీలో సమంత సాధించిన క్రేజ్ ఏపాటిదో అందరికీ తెలిసిందే. ఇటు తెలుగులో అటు తమిళంలో క్రేజీ ప్రాజెక్ట్స్‌లో హీరోయిన్‌గా నటించి భారీ హిట్స్ తన ఖాతాలో వేసుకున్నారు. కమర్షియల్ సినిమా అంటే ముందు సమంత పేరునే పరిశీలిస్తున్నారు దర్శకనిర్మాతలు. ఇప్పటికే తమిళ, తెలుగు ఇండస్ట్రీలో స్టార్ హీరోల సరసన రెండుమూడు సార్లు నటించారు. ప్రస్తుతం సమంత చేతిలో క్రేజీ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. గుణశేఖర్ దర్శకత్వంలో నటించిన 'శాకుంతలం' పోస్ట్ ప్రొడక్షన్స్ వర్క్‌ను జరుపుకుంటోంది. 'యశోద' , విజయ్ దేవరకొండసరసన నటిస్తున్న 'ఖుషి' చిత్రాలు షూటింగ్ దశలో ఉన్నాయి. అయితే, తాజాగా సమంతకు సంబంధించిన ఓ లేటెస్ట్ న్యూస్ వచ్చి నెట్టింట చక్కర్లు కొడుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సరసన హీరోయిన్‌గా మరోసారి అవకాశం అందుకుందట. ఇటీవలే 'బీస్ట్' సినిమాతో వచ్చి హిట్ అందుకున్న విజయ్, ప్రస్తుతం తెలుగులో ఎంట్రీ ఇస్తూ ఓ ద్విభాషా చిత్రాన్ని చేస్తున్నారు. ఈ మూవీ రెండవ షెడ్యూల్ చెన్నైలో జరుగుతోంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మాణంలో నిర్మిస్తున్న దీనికి వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తున్నారు.తాజాగా 'విక్రమ్' సినిమాతో భారీ హిట్ అందుకున్న డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో విజయ్ నెక్స్ట్ సినిమాను చేయనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా సమంతను ఎంపిక చేయాలని మేకర్స్ భావిస్తున్నారట. కథ నచ్చడంతో ఆమె కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై క్లారిటీ కూడా రానుందని సమాచారం. ఇప్పటికే విజయ్ - సమంత కలిసి 'తేరి', 'మెర్సెల్', 'కత్తి' చిత్రాలలో నటించారు. ఈ సినిమాలు మంచి విజయం సాధించాయి. లోకేష్ సినిమాలో విజయ్ సరసన సమంత నటించేది నిజం అయితే ఇది నాలుగో చిత్రం అవుతుంది.

## కమల్‌కు ఉదయనిధి శుభాకాంక్షలు



నటుడు కమల్‌హాసన్ విక్రమ చిత్రంలో మరోసారి తన నట విశ్వరూపాన్ని ప్రదర్శించారు.. తన సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మించారు. మలయాళ నటుడు ఫాహద్ ఫాజిల్ ప్రధాన పాత్ర పోషించగా విజయ్ సేతుపతి విలన్‌గా నటించారు. అనిరుధ్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. తమిళనాడులో విక్రమ్ మూవీని ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్ జాయింట్ మూవీస్ సంస్థ భారీ ఎత్తున విడుదల చేసింది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ చిత్రానికి ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతించడం విశేషం. ఈ సినిమాకు పాజిటివ్ టాక్ వస్తుండటంతో ఉదయనిధి స్టాలిన్ కమల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



బాలయ్యతో అనిల్ సినిమా... కామెడీకి ప్రాధాన్యం

నందమూరి బాలకృష్ణకు మాస్ యాక్షన్ సినిమాలతో ఏ స్థాయిలో గుర్తింపు వస్తుంది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. బాలకృష్ణ 107వ సినిమా ఫ్యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో యాక్షన్ సినిమా గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. అయితే వరుసగా ఆక్షన్ సినిమాలు పడడంతో తనలోని విభిన్నమైన కామెడీ టైమింగ్ తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకోవాలి అనే బాలకృష్ణలో బలమైన ఒక కోరిక ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ3 సినిమాను ప్రత్యేకంగా వీక్షించిన బాలయ్య బాబు అనిల్ రావిపూడి పనితనాన్ని చూసి తన తదుపరి సినిమాలో కామెడీ టైమింగ్ కాస్త ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని కూడా ఒక కండిషన్ పెట్టినట్లు తెలుస్తోంది. అయితే నందమూరి బాలకృష్ణ తో సినిమా చేయాలని తన కెరీర్ మొదటి నుంచి కూడా ప్రయత్నాలు చేస్తూ ఉన్న అనిల్ రావిపూడికి మొత్తానికి నెక్స్ట్ సినిమాలోతో ఆ అవకాశం దొరికేసింది. అయితే ఆ ప్రాజెక్టు పక్కా మాస్ కమర్షియల్ గా ఉంటుంది అని ఇంతవరకు బాలయ్యను ఎవరూ చూపించని తరహాలో చూపించబోతున్నాను అని దర్శకుడు క్లారిటీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే బాలయ్య బాబు మాత్రం బయట ప్రపంచంలో మంచి సెన్సాఫ్ హ్యూమర్ తో కనిపిస్తూ ఉంటారు. కాబట్టి కామెడీ సినిమాలకు జనాలు చాలా బాగా ఎంజాయ్ చేస్తారని అందుకే నెక్స్ట్ సినిమాలో మాస్ కమర్షియల్ అంశాలతో పాటు కామెడీ సన్నివేశాలు కూడా బలంగా ఉండేలా చూసుకోవాలి అని బాలయ్య బాబు అనిల్ రావిపూడికి సలహా ఇచ్చినట్లుగా తెలుస్తోంది. మరి ఈ కామెడీ దర్శకుడు యాక్షన్ సినిమాలో కామెడీ సీన్స్ ను ఎలా మ్యాచ్ చేస్తాడో చూడాలి.

## భారతీయుడు-2 వస్తుంది: కమల్ హాసన్



నాలుగేళ్ల తర్వాత లోకనాయకుడు కమల్ హాసన్ వెండితెరపై సందడి చేశాడు. తాజాగా ఆయన నటించిన 'విక్రమ్: హిట్ లిస్ట్' మూవీ అదిరిపోయే రెస్పాన్స్‌తో దూసుకుపోతోంది. సినిమా సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న కమల్ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇందులో 'భారతీయుడు 2' (ఇండియన్ 2) గురించి మాట్లాడారు. శంకర్ దర్శకత్వంలో వస్తున్న 'భారతీయుడు 2' సినిమాపై కమల్ స్పందనను యాంకర్ కోరగా ఈ వ్యాఖ్యలు చేశాడు. భారతీయుడు 2 సినిమా ఆగిపోలేదు. తప్పకుండా ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం. అయితే కరోనా, సెట్‌లో ప్రమాదం ఇలా రకరకాల కారణాలతో సినిమా చిత్రీకరణ ప్రారంభం నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అయినా షూటింగ్ కంటిన్యూ చేశాం. ఈ సినిమా నిర్మాణ సంస్థ అయిన లైకా వాళ్లతో ఇప్పటికే మాట్లాడాం. వాళ్లు కూడా త్వరగా పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఇంకో 40 శాతం షూటింగ్ మిగిలి ఉంది. అది కూడా త్వరలోనే చేస్తాం. ఎందుకంటే ఒక చిత్రంపైనే పదేళ్లు పని చేయలేం కదా. రాజ్ కమల్ ఫిల్మ్స్ అని నాకొక నిర్మాణ సంస్థ ఉంది. అలాగే శంకర్‌కి ఎస్. ప్రొడక్షన్స్ ఉంది. ఈ రెండు చాలా పెద్ద సంస్థలు. ఈ రెండింటిని మేమే పోషించాలి. అందుకోసం మేం బయటకు వెళ్లి పనిచేయాలి. అని కమల్ హాసన్ పేర్కొన్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com